గుడుంబా స్థావరాలపై దాడులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని బాబునాయక్ తండాలో శనివారం గుడుంబా స్థావరాలపై దాడులు చేసి 5 లీటర్ల గుడుంబా, 50 కిలోల నల్ల బెల్లం స్వాధీనం చేసుకుని, 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్ ప్రతాప్, టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై బి.విజయ్, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా అయోధ్య గ్రామ శివారు భజన తండా పరిధిలో 20 లీటర్ల గుడుంబా, 60 కిలోల నల్లబెల్లం స్వాధీనం చేసుకుని, 1,120 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో డీసీఆర్బీ సీఐ సత్యనారాయణ, ఎస్సై మురళీధర్ రాజు, రూరల్ ఎస్సై దీపికరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. గుడుంబా తయారీ, క్రయవిక్రయాల వల్ల జరిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

భీముడు తండా, పెద్దదుబ్బతండాలో..

తొర్రూరు: మండలంలోని భీముడు తండా, పెద్ద దుబ్బతండాలో పోలీసులు గుడుంబా స్థావరాలపై శనివారం దాడులు నిర్వహించారు. 50 లీటర్ల నాటు సారా, 500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సంజీవ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై జగదీష్, కానిస్టేబుళ్లు సాయి కిరణ్, శ్రీనివాస్, విజేందర్, తిరుమల్, సాయికృష్ణ, రాజు, హైమ, తదితరులు పాల్గొన్నారు.

కురవి: మండలంలోని నేరడ శివారు ఎల్కచెట్టు జీపీ పరిధిలోని మంచ్యా తండాలో ఎస్సై గోపి ఆధ్వర్యంలో పోలీసులు శనివారం గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు.

దుబ్బతండాలో..

దంతాలపల్లి: మండలంలోని తూర్పుతండా గ్రామ పంచాయితీ దుబ్బతండాలో శనివారం గుగులోతు చన్ను ఇంట్లో 9లీటర్ల గుడుంబా, 300 లీటర్ల బెల్లం పానకం పోలీసులు ధ్వంసం చేశారు. గున్నెపల్లి శివారు తండాల గుగులోత్ మాన్య ఇంట్లో 6లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని 100లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. ఇరువురిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై కరుణాకర్ తెలిపాడు, కార్యక్రమంలో పోలీస్‌లు ప్రకాశ్‌రెడ్డి, మధు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

అంజనాపురంలో..

గార్ల: మండలంలోని అంజనాపురం గ్రామంలో గూగులోత్ శాంతి, ఇస్లావత్ జ్యోతి గుడుంబా విక్రయిస్తున్నారని పక్కా సమాచారం మేరకు ఎస్సై జీనత్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. 17లీటర్ల కాపుసారా, 200 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేశారు. అనంతరం ఇద్దరిపై కేసు నమోదు చేశారు. దాడుల్లో స్పెషల్ బ్రాంచ్ ఎస్సై రియాజ్‌పాషా, హెడ్‌కానిస్టేబుల్ జయరాజు, సిబ్బంది శ్రీను, రామనర్సయ్య, రాము, తదితరులు పాల్గొన్నారు.

రాముతండాలో..

డోర్నకల్: మండలంలోని రాముతండా, లకావత్‌తండాలో శనివారం డోర్నకల్ పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. రెండు తండాల్లోని ఇళ్లు, వ్యవసాయ భూముల్లో రహస్యంగా నిల్వ ఉంచిన బెల్లం పానకాన్ని పోలీసులు ధ్వంసం చేసి నాటుసారాను స్వాధీనపర్చుకున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ బి.ఉపేందర్‌రావు, ఎస్సై సంతోష్‌రావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు.

రేకులతండాలో..

కేసముద్రం: ఇనుగుర్తి మండలంలోని తారాసింగ్‌తండా జీపీ శివారు రేకులతండాలో గుడుంబా స్థావరాలపై ఇన్‌స్పెక్టర్ బాలాజీ వరప్రసాద్, ఎస్సై జితేందర్, సెకండ్ ఎస్సై రాజయ్య ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. ఈమేరకు 300 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 50కేజీల నల్లబెల్లం, 50 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు వారు తెలిపారు.


మహబూబాబాద్ రూరల్: భజనతండాలో దాడులు చేస్తున్న పోలీసులు


డోర్నకల్: రాముతండాలో దాడులు నిర్వహిస్తున్న పోలీసులు


గార్ల: మండలం అంజనాపురంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై జీనత్‌కుమార్


తొర్రూరు: పెద్ద దుబ్బతండాలో..


దంతాలపల్లి: దుబ్బతండాలో..


కురవి: మంచ్యా తండాలో..


కేసముద్రం: రేకులతండాలో..

క్లుప్తంగా

క్రీడాకారులకు మంచి అవకాశం

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులను చదువుతోపాటు క్రీడల్లో ప్రోత్సహించాలని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి అనిల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం జిల్లా స్థాయి క్రీడా పాఠశాల ఎంపికలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 38 మంది బాలురు, 32 మంది బాలికలు జిల్లాస్థాయి ఎంపికలకు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో బాస్కెట్ బాల్ కోచ్ కుమారస్వామి, పీడీలు, పీఈటీలు జ్యోతి, పద్మవతి, పుష్పలీల, శంకర్, చాంప్లనాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆదర్శం



మహబూబాబాద్ అర్బన్: విద్యా బోధన చేస్తూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతూ పలు సేవా కార్యక్రమాలు చేస్తూ, నేటి ఉపాధ్యాయులకు ఆదర్శం కిషన్‌సార్ అని డీఈఓ పి.రామారావు అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం గుగులోత్ కిషన్ నాయక్ పదవీ విరమణ కార్యక్రమానికి డీఈఓ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఏసీజీఈ మందుల శ్రీరాములు, ఏఎస్ఓ సంతోష్, ఎంఈఓ పూల్‌చంద్, నోడల్ హెడ్‌మాస్టర్ లచ్చిరాం, హెచ్ఎంలు వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరావు, కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో స్థానం పొందాలి

తొర్రూరు: ప్రజల గుండెల్లో స్థానం పొందేలా ఉద్యోగులు పని చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ అన్నారు. మండలంలోని గుర్తూరు గ్రామ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు దురుసోజు భాస్కరాచారి పదవీ విరమణ కార్యక్రమం శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల సతీష్‌రెడ్డి, ఉపాధ్యాయులు సోమిరెడ్డి, శ్రీనివాస్, బీవీరావు, వేణుమాధవ్‌రెడ్డి పాల్గొన్నారు.

కస్తూర్బాలో నాణ్యమైన విద్య



పెద్దవంగర: కార్పొరేట్ చదువులకు దీటుగా పేద విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందిస్తూ కస్తూర్బాగాంధీ పాఠశాల ఆదర్శంగా నిలుస్తోందని ఎంపీపీ ఎర్ర సబిత వెంకన్న అన్నారు. శనివారం మండలంలోని చిన్నవంగర కేజీబీవీతోపాటు చిన్నవంగర, బావోజీతండా ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను స్థానిక ఎంపీటీసీ మెట్టు సౌజన్య నగేష్‌తో ఆమె కలిసి సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించి, సమస్యలపై ఆరా తీశారు.

ఫీజుల్లో రాయితీ

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ ఇచ్చిన రిప్రజెంటేషన్‌ను పరిగణనలోకి తీసుకుని జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల్లో రాయితీ కల్పించాలని డీఈఓ రామారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

వసతి గృహాలపై నిర్లక్ష్యం తగదు

దంతాలపల్లి: మండలంలో విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన వసతి గృహాలపై నిర్లక్ష్యం తగదని ఎంపీడీఓ వివేక్‌రామ్ అన్నారు. మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో ఎస్సీ బాలుర వసతి గృహాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న ఆహారం పరిశీలించారు. పేరుకుపోయిన చెత్తను, చుట్టు ఉన్న కంప చెట్లను తొలగించాలని సిబ్బందికి సూచించారు. వసతిగృహంలో వార్డెన్ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

భూ ఆక్రమణదారులపై చర్య తీసుకోవాలి



మరిపెడ రూరల్: భూ ఆక్రమణదారులపై చర్య తీసుకొని, వారి నుంచి రక్షణ కల్పించాలని రైతు దంపతులు బానోతు కొండయ్య-కవిత అధికారులను వేడుకున్నారు. ఈసందర్భంగా శనివారం మండలంలోని నీలికుర్తి రెవెన్యూ పరిధిలోని పర్కాజలతండా శివారు ప్రాంతంలో సర్వే నంబర్ 113లో తమకు ఎకరం 34గుంటల వ్యవసాయ భూమి ఉందన్నారు. తండాకు చెందిన బానోతు బాలాజీ, గోపా, శ్రీనివాస్, వెంకన్న, శంకర్ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని ఆరోపించారు. భూ ఆక్రమణదారులపై చర్య తీసుకొని న్యాయం చేయాలని వేడుకున్నారు.

అప్రమత్తతతో పనులు చేయాలి

గూడూరు: వర్షాకాలంలో విద్యుత్ మరమ్మతు పనులు అప్రమత్తతతో చేయాలని విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ పి.విజయ్‌కుమార్ అన్నారు. గూడూరు శివారు వడ్డెరగూడెంలో శనివారం ఏడీఈ కె. కవిత ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని గూడూరు, అయోధ్యపురం సెక్షన్ విద్యుత్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యుత్ లైన్‌లో లూజ్ లైన్, ఒరిగిన విద్యుత్ స్తంభాల పనులు చేసే ముందు తగిన చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలంలో విద్యుత్ అంతరాయాలను వెంటనే సరిచేయాలని సూచించారు. సమావేశంలో విద్యుత్ ఏఈలు, సబ్ ఇంజనీర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆవిర్భావ సభకు తరలిరండి

మహబూబాబాద్ రూరల్: హైదరాబాద్ రవీంద్ర భారతిలో జూలై ఒకటో తేదీన జరగనున్న ఎల్‌హెచ్‌పీఎస్ 27వ ఆవిర్భావ సభకు తరలిరావాలని తెలంగాణ ఎల్‌హెచ్‌పీఎస్ నాయకుడు గుగులోతు వెంకట్ నాయక్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని రామన్నపేట కాలనీలో గల హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో శనివారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు శంకర్ నాయక్, దస్రునాయక్, అర్జున్ నాయక్, కొమురయ్య, నాగ్యానాయక్, రవి పాల్గొన్నారు.

కేసు నమోదు

డోర్నకల్: మండలంలోని అందనాలపాడు మాజీ సర్పంచ్‌తోపాటు కుటుంబ సభ్యులపై డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ బి.ఉపేందర్‌రావు శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. అందనాలపాడు గ్రామపంచాయతీకి చెందిన నీళ్ల బావికి మాజీ సర్పంచ్ ఆంగోత్ మోహన్ విద్యుత్ మోటార్ అమర్చి వ్యవసాయానికి నీరు వాడుకుంటున్నాడు. పంచాయతీ సిబ్బంది మోటార్‌కు తొలగించేందుకు వెళ్లగా మోహన్‌తోపాటు కుటుంబసభ్యులు దౌర్జన్యం చేసినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి బుర్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు ఆంగోత్ మోహన్‌తో ఏడుగురు కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎంపీపీ అరుణ

మరిపెడ: అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని ఎంపీపీ గుగులోతు అరుణ అన్నారు. శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశానికి ఉదయం నిర్ణీత సమయం కంటే కొంతమంది అధికారులు ఆలస్యంగా రావడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత వర్షాకాలంలో విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉద్యోగం చేయడం కాదు ప్రజలకు సేవ చేయాలనే తపన కలిగి ఉండాలన్నారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన శేషయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తేజావత్ శారద, మండల ఉపాధ్యక్షుడు గాదె అశోక్‌రెడ్డి, ఎంపీడీఓ రేవతి పాల్గొన్నారు.

వక్ఫ్ అధికారుల సర్వే

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లోని భూముల్లో శనివారం వక్ఫ్ అధికారులు సర్వే నిర్వహించారు. డోర్నకల్‌లోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ, వక్ఫ్ భూములు ఆక్రమణకు గురయ్యాయని బీజేపీ నాయకులు కాపరబోయిన సత్యనారాయణ చేసిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్ వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఆడిటింగ్ జమాలుద్దీన్ బృందం సర్వే నిర్వహించారు. సర్వే నంబర్ 136లో 2.5ఎకరాలు, 137లో 4.5 ఎకరాలు, 3లో ఎకరం, 2లో 5ఎకరాలు, 5లో 1.5 ఎకరాల ప్రభుత్వ, వక్ఫ్ భూములు ఆక్రమణకు గురయ్యాయనే ఫిర్యాదు మేరకు వక్ఫ్ అధికారులతోపాటు స్థానిక రెవెన్యూ సర్వేయర్ వెంకట్ పోలీసుల సహకారంతో సర్వే నిర్వహించారు. సర్వే నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు సర్వేయర్ వెంకన్న తెలిపారు.

వైద్యశిబిరం

గూడూరు: మండలంలోని సీతానగరంలో గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను శనివారం అయోధ్యపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ యమున, వైద్య సిబ్బంది లోక్యానాయక్, సర్దార్ బాబు, గణేష్, హేమలత పాల్గొన్నారు.

మరమ్మతుకు నోచుకోని తూము

- నిధులు మంజూరైనా పనులు చేపట్టని ఇరిగేషన్ అధికారులు


మరమ్మతుకు గురైన కొండలమ్మ చెరువు తూము

గార్ల: మండలంలోని కొండలమ్మ చెరువు తూము, చెరువుకట్ట మరమ్మతుకు గత ఏడాది నిధులు మంజూరైన టెండర్ ప్రక్రియ పూర్తయినా సదరు కాంట్రాక్టర్ నేటికీ మరమ్మతులు చేపట్టడం లేదని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండలమ్మ చెరువు కింద 400 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. ఇట్టి చెరువు తూము దెబ్బతిని లీక్ అయ్యి నీరు వృథాగా పోతుంది. దీంతో ప్రతీ ఏటా ఖరీఫ్‌లో పంట చేతికొచ్చే దశలో లీకేజీ వలన చివరి ఆయకట్టు భూములకు నీరు అందక ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులో సగం మేర నీరు చేరుకోగా తూము లీకేజీ వలన వర్షానికి చేరుకున్న నీరంతా బయటికి వెళ్లిపోయిందని రైతులు పేర్కొన్నారు. అదేవిధంగా చెరువు కట్ట సైతం పూర్తిగా దెబ్బతిన్నది. ఈఏడాది ఖరీఫ్ ప్రారంభమవుతున్నా నేటికీ సంబంధిత ఇరిగేషన్ అధికారులు మాత్రం చెరువు మరమ్మతుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. చెరువు, తూము మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు సంబంధిత జిల్లా ఇరిగేషన్ అధికారులకు విన్నవించినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఇరిగేషన్ అధికారులు స్పందించి చెరువు, తూములకు వెంటనే మరమ్మతులు చేపట్టి రైతుల పంటలను కాపాడాలని ఆయకట్టు రైతులు ఇందుర్తి వెంకట్‌రెడ్డి, పులిచింతల ఉపేందర్ రెడ్డి, మల్లేశం, తదితర రైతులు విజ్ఞప్తి చేశారు. ఇట్టి విషయంపై ఇరిగేషన్ ఏఈ శ్యాంప్రసాద్‌ను 'సాక్షి' వివరణ కోరగా కాంట్రాక్టర్‌తో మాట్లాడి వారం రోజుల్లో కొండలమ్మ చెరువు తూము మరమ్మతులు చేపట్టి తూము లీకేజీని నివారిస్తామని వెల్లడించారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న తండావాసులు

కేసముద్రం: ఇళ్ల స్థలాలు కేటాయించాలంటూ ప్రధాన రహదారిపై పలువురు తండావాసులు రాస్తారోకో చేసిన సంఘటన మండలంలోని భుక్యా రాంతండాజీపీ శివారు కాలనీతండాలో శనివారం చోటుచేసుకుంది. ఈసందర్భంగా పలువురు ఆందోళనకారులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 45 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చిందన్నారు. దీంతో కేటాయించిన స్థలాల్లో ఇళ్లను నిర్మించుకుంటుండగా, అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ల మేరకు ఇళ్ల నిర్మాణాలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా తమకు ఇంటి స్థలాలను కేటాయించి, నిర్మాణాలు జరిగేలా చూడాలన్నారు. ఆందోళకారులతో ఎస్సై వంశీధర్ ఫోన్‌లో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. కార్యక్రమంలో భుక్యా రమేష్, జాటోత్ వెంకన్న, వాల్యా, యాకుబ్, నరేష్, విజేందర్, వెంకన్న, చిన్ని, గణేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలి



మాట్లాడుతున్న నారాయణ

తొర్రూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించాలని ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల నారాయణ కోరారు. శనివారం డివిజన్ కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ అధ్యాపకుల సంఘం సమావేశం నిర్వహించారు. నారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే పేద విద్యార్థుల సౌకర్యార్థం ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేయాలన్నారు. హడావుడిగా ఉదయాన్నే భోజనం చేయకుండా పేద బిడ్డలు కాలేజీ తరగతులకు హాజరవుతారని, మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తే విద్యలో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి గంటి రవి, జాయింట్ సెక్రెటరీ తిరుమలరావు, నాయకులు పోడేటి రవీందర్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు సహకరించాలి


పనులు పరిశీలిస్తున్న అధికారులు

తొర్రూరు: మున్సిపాలిటీలో మౌలిక సౌకర్యాల కల్పనకు స్థానికులు సహకారం అందించాలని టౌన్ ప్లానింగ్ విభాగం రీజినల్ డైరెక్టర్ ప్రసాద్ అన్నారు. పట్టణంలో కొనసాగుతున్న డ్రైనేజీల నిర్మాణ పనులను శనివారం కమిషనర్ శాంతి కుమార్‌తో కలిసి పరిశీలించారు. డ్రైనేజీల నిర్మాణంలో స్థానికుల నుంచి వెళ్తున్న అభ్యంతరాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు జరుగుతున్న తరుణంలో కొంత అసౌకర్యం కలుగుతుందని, స్థానికులు సహకరించాలని కోరారు. డ్రైనేజీల ఏర్పాటుతో రోడ్లపై మురుగు సమస్య తీరుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈ రంజిత్, టౌన్ ప్లానింగ్ అధికారి ఖురేషీలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి

నెల్లికుదురు: అప్పుల బాధతో మనస్తాపానికి గురైన ఓ రైతు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈసంఘటన మండలంలోని హేమ్లా తండా గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బానోతు బాలు (50) తనకున్న 3 ఎకరాల వ్యసాయ భూమిలో పంటలు సాగు చేయడం కోసం వ్యవసాయ బావిని తవ్వించడానికి రూ.5లక్షల వరకు అప్పు చేశాడు. కాలం కలసిరాక పంట పండక అప్పులు తీర్చలేకపోయాడు. 25గుంటల భూమిని విక్రయించి కొన్ని అప్పులు చెల్లించాడు. అయిన అప్పులు తీరడంలేదని మనస్తాపానికి గురై బాలు ఈనెల 28న వ్యవసాయ పొలం వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడని మృతుడి కుమారుడు బానోతు నవీన్ ఫిర్యాదు పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పంచనామా కోసం మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సంక్షిప్త సమాచారం

లీకేజీపై విచారణ చేపట్టాలి

బయ్యారం: నీట్ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ నిర్వహించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ శనివారం డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో బయ్యారంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు అరవింద్, జైపాల్, ప్రకాశ్, రాజు, మహేందర్, సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

నర్సింహులపేట: మండలంలోని నర్సింహపురం(బంజర) గ్రామం నుంచి వరదరాజులకుంటకు బతుకమ్మలు తీసుకెళ్లే రోడ్డును జేసీబీతో చదును చేసి గ్రామానికి చెందిన కరుణాకర్ స్వాధీనం చేసుకున్నాడని శనివారం గ్రామస్తులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు సమ్మయ్య, వెంకన్న, శ్రీను, సైదులు, రమేష్, ఎల్లయ్య, రవి, సుధాకర్ పాల్గొన్నారు.

సన్మానం

నెల్లికుదురు: ఎస్‌జీటీ నుంచి ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పదోన్నతిపై మండలంలోని మునిగలవీడు ప్రాథమిక పాఠశాలలో బాధ్యతలు చేపట్టిన బోయిన రవీందర్‌ను శనివారం సన్మానించారు. అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు అందించారు. కార్యక్రమంలో వెంకన్న, దర్గాహుస్సేన్, కేదారి, సోమయ్య, విజయ్ పాల్గొన్నారు

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ

కేసముద్రం: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లోగల సివిల్ సప్లయీస్ గోదాంను(ఎంఎల్ఎస్ పాయింట్) జిల్లా విజిలెన్స్ అధికారులు, సివిల్ సప్లై అధికారులు శనివారం తనిఖీ చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

విద్యార్థుల కమిటీ ఎన్నిక

డోర్నకల్: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం విద్యార్థుల కమిటీ ఏర్పాటుకు ఎన్నిక నిర్వహించారు. సాధారణ ఎన్నికల తరహాలో బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించారు. 6నుంచి 10వ తరగతికి చెందిన 209 మంది విద్యార్థులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం హెచ్ఎం నర్సింహారావు మాట్లాడారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కురవి: కురవి శివారు లింగ్యా తండా జీపీ పరిధిలోని మూడుగుడిసెల తండాకు చెందిన జక్రాం అనే వ్యక్తి కురవి నుంచి బైక్‌పై తండాకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కురవి పెద్ద చెరువు సమీపంలో జాతీయ రహదారిపై గేదెను ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108కి సమాచారం అందించడంతో సకాలంలో పైలట్ జక్కుల వీ రన్న, ఈఎంటీ దాసరి వెంకన్న హుటాహుటీన సంఘటన స్థలానికి వచ్చి క్షతగాత్రుడిని వాహనంలో మానుకోట జనరల్ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక డంప్‌లు సీజ్



దంతాలపల్లి: మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో పాలేరువాగు నుంచి శనివారం అక్రమంగా ఇసుక సరఫరా చేస్తున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. స్పందించిన తహసీల్దారు శ్రీనివాస్‌రావు అక్రమ ఇసుక డంపులను సీజ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎస్సై కరుణాకర్, ఆర్ఐ నజీముద్దీన్ గ్రామానికి వెళ్లి సుమారు 30 ట్రిప్పుల ఇసుకను సీజ్ చేశారు.

పంట చేనులోకి దూసుకెళ్లిన కారు

కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన బిజిగ సందీప్ శనివారం కారు డ్రైవింగ్ చేసుకుంటూ వెళ్తుండగా బిచ్చానాయక్‌తండా సమీపంలోని మలుపు వద్ద కారు అదుపుతప్పి పంటచేనులోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న సందీప్‌కు స్వల్పగాయాలు కాగా 108లో జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

కురవి: ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోటలాలయ్య అన్నారు. శనివారం మండలంలోని రాజోలు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల హెచ్ఎం లింగు బాబు పదవీ విరమణ సభ జరిగింది. ఈసందర్భంగా లింగుబాబు దంపతులను సత్కరించారు.

చందు సేవలు మరువలేనివి

బయ్యారం: వైద్యశాఖలో 36ఏళ్లపాటు వివిధ హోదాల్లో పనిచేసి సీహెచ్ఓగా పదవీ విరమణ పొందుతున్న చందు సేవలు మరువలేనివని డీఎంహెచ్ఓ కళావతిబాయి అన్నారు. పీహెచ్‌సీ ఆవరణంలో శనివారం చందు పదవీ విరమణ సన్మాన సభను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ శంకర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ అంబరీష్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

దంతాలపల్లి: పత్తి పంటలో, నారు మడుల్లో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి అని వ్యవసాయ విస్తరణ అధికారి గాడిపెల్లి సందీప్ అన్నారు. శనివారం మండలంలోని తూర్పుతండా గ్రామ పంచాయతీలో పత్తి, నారు మడులు పరిశీలించి రైతులతో మాట్లాడారు.

బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి

కురవి: ప్రమోషన్‌లలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చూడాలని, బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మల్లారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రాజోలు గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజశేఖర్, మురళీకృష్ణ, యాకూబ్, అల్లరవి, బాలునాయక్, బాలరాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సర్వీసులను పెంచాలి

గార్ల: మహబూబాబాద్, ఖమ్మం డిపోల నుంచి ప్రయాణికుల సౌకర్యార్థం గార్ల మండలానికి బస్సు సర్వీసులను పెంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసరావు శనివారం డిమాండ్ చేశాడు.

బీమా డబ్బుల అందజేత

కురవి: సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామానికి చెందిన నాయిని శ్రీనివాస్ కురవిలోని ఏపీజీవీబీలో ఖాతాదారుడిగా ఉన్నారు. ఇటీవల ఆయన గుండెపోటుతో మృతి చెందాడు. ప్రధాన మంత్రి జీవనజ్యోతి యోజన పథకం ద్వారా రూ.2లక్షల బీమా డబ్బులు మృతుడి సతీమణికి బ్రాంచ్ మేనేజర్ లోకేష్ అందజేశారు.

ఆర్థికసాయం

గూడూరు: మండలంలోని చక్కతండాకు చెందిన బానోతు యాకూబ్ కుమారుడు దీక్షిత్ చిన్నప్పటి నుంచి తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల ఆ బాలుడికి కడుపులో కంతి ఉందని వైద్యులు ధ్రువీకరించారు. ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించారు. ఈవిషయం తెల్సుకున్న చక్కతండా మాజీ సర్పంచ్ దంపతులు శనివారం ఆసుపత్రికి చేరుకొని రూ.10వేల ఆర్థికసాయం అందించారు.

బంజారాలు తరలిరావాలి

డోర్నకల్: హైదరాబాద్ రవీంద్రభారతిలో జూలై 1న జరిగే బంజారాల సభకు గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మున్సిపల్ కౌన్సిలర్ బోడ అమలాహరిలాల్ శనివారం కోరారు.

దంపతుల అరెస్ట్..

డోర్నకల్: కన్నతల్లి ఆత్మహత్యకు కారకులైన కొడుకు, కోడలిని స్థానిక పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాలు.. తహసీల్దార్ బంజరాకు చెందిన సామల విజయలక్ష్మి(53) ఈ నెల 21న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మర్నాడు మృతి చెందింది. మృతురాలి చిన్నకుమారుడు శ్రీకాంత్‌రెడ్డి, కోడలు నాగమణి తనతో గొడవ పడడంతో మనస్తాపానికి గురైన విజయలక్ష్మి ఆత్మహత్య చేసుకుందని ఫిర్యాదు అందడంతో కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి, కోడలు నాగమణిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.